సాక్షి
కాకినాడ
శనివారం । 20 । జనవరి । 2024



..తిరిగిరాని లోకాలకు..

అనకాపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. మృతులు బిక్కవోలుకు చెందినవారు.

8 లో



పీఠాధిపతుల కృషి ప్రశంసనీయం

ఆధ్యాత్మికత బోధనల ద్వారా సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తూ..ధర్మ ప్రచారానికి పీఠాధిపతులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు.

8 లో

10,450 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 10,450 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5వేల క్యూసెక్కులు చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.05 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. విద్యా సంస్థలకు సంక్రాంతి సెలవులు మరో మూడు రోజులు పొడిగించడంతో తెల్లవారుజాము నుంచే వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సత్యదేవుని దర్శించుకున్నారు. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవుల చుట్టూ ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని మొత్తం 40 వేల మంది దర్శించారు. సుమారు 2 వేల వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 5 వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజనం పెట్టారు. పుష్య శుద్ధ దశమి, ఏకాదశి పర్వదినాలను పురస్కరించుకుని శని, ఆదివారాల్లో కూడా సత్యదేవుని ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

23న మినీ జాబ్ మేళా

తుని: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 23న తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా అధికారి డి.హరిశేషు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, ఎంకాం చదివిన వారు అర్హులన్నారు. ముత్తూట్ ఫైనాన్స్, అరబిందో, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థల్లో పోస్టుల భర్తీకి ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 99495 00473 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

వికాసలో 22న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈ నెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. డెస్టినీ సీఎస్, ముత్తూట్ ఫైనాన్స్, ఎంసీవీ బజాజ్, డీ మార్ట్ సంస్థల్లో వివిధ ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన 30 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం, ఆయా ఉద్యోగాలను బట్టి ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆ రోజు ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలని సూచించారు. అలాగే డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా అర్హులకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశం కల్పిస్తామని లచ్చారావు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు పయనం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాజస్థాన్‌లోని సవాయిలో శనివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి జూనియర్స్ తైక్వాండో పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు శుక్రవారం పయనమైంది. జిల్లా తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు ఈ విషయం తెలిపారు. రాష్ట్ర జట్టులో 40 మంది సభ్యులు ఉండగా వీరిలో జిల్లా నుంచి 15 మంది పాల్గొంటున్నారన్నారు. గత నెల 29, 30 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన వారు ఈ పోటీలకు అర్హత పొందారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా తైక్వాండో సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి ఎలీషాబాబు, కోచ్ బి.అర్జునరావు తదితరులు అభినందించారు.

ఖేలో ఇండియా పోటీలకు..

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నంద్యాలలో ఆదివారం జరిగే రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనే జిల్లా తైక్వాండో జట్టు శుక్రవారం పయనమైంది. తూర్పు గోదావరి జిల్లా తైక్వాండో సంఘ అధ్యక్షుడు రాయుడు శ్రీనివాస్ ఈ విషయం తెలిపారు. వచ్చే నెల 7, 8 తేదీల్లో పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు ఎంపిక నంద్యాలలో జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి 24 మంది క్రీడాకారులు హాజరవుతున్నారని సంఘ కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులను ముత్తా నవీన్ అభినందించారు.

చిన్న బోట్లే ముద్దు



పీఎంఎంఎస్‌వై కింద కాకినాడ మత్స్యకారులకు అందజేసిన రూ.1.20 కోట్ల విలువైన డీప్ సీ వెసల్

కాకినాడ దుమ్ములపేటకు చెందిన శ్రీ ఓం సాయిరామ్ మహిళా మత్స్య సహకార సంఘానికి సముద్రం లోతు జలాల్లో చేపల వేట సాగించేందుకు వీలుగా ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద డీప్ సీ వెసల్ (పెద్ద బోటు) మంజూరు చేశారు. కొచ్చిన్‌లో తయారైన ఈ వెసల్‌లో 30 టన్నుల వరకూ చేపలు నిల్వ చేయవచ్చు. దీంతో పాటు ఇందులోనే ఐస్ కూడా తయారు చేసుకోవచ్చు. రూ.1.20 కోట్ల విలువైన ఈ యూనిట్‌కు రూ.72 లక్షల (60 శాతం) వరకూ సబ్సిడీ లభించింది. అయితే, ఈ డీప్ సీ వెసల్ నిర్వహణ భారవుతోందని, పైగా అంత పెద్ద బోటు తమకు అవసరం ఉండదని మత్స్యకారులు చెబుతున్నారు. సుమారు రూ.60 లక్షల విలువైన చిన్న బోట్లు సమకూర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సాగర్ పరిక్రమ యాత్రలో భాగంగా ఇటీవల కాకినాడ ఫిషింగ్ హార్బర్‌కు వచ్చిన కేంద్ర మత్స్య శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలాకు ఈ మేరకు వారు విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. మత్స్యకారుల అవసరాలకు అనుగుణంగా ఈ పథకంలో మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు.

- పీఎంఎంఎస్‌వై కింద రూ.1.20 కోట్లతో పెద్ద వెసల్ మంజూరు
- నిర్వహణ భారమంటున్న మత్స్యకారులు
- దీనిలో సగం ధరకే చిన్న బోట్లు ఇవ్వాలని విన్నపాలు
- ఆ మేరకు పథకంలో మార్పులు చేయాలని డిమాండ్

కాకినాడ రూరల్: పెద్ద బోట్లు వద్దు.. చిన్న బోట్లే ముద్దు.. ఇదీ మత్స్యకారులు చెబుతున్న మాట. సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ సబ్సిడీతో బోట్లు అందిస్తున్నాయి. ఈ పథకంలో వివిధ యూనిట్లతో పాటు పెద్ద బోట్లు ఇస్తున్నారని, వీటి నిర్వహణ తమకు భారంగా మారుతోందని, వీటికి బదులు చిన్న బోట్లు అందజేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం

సువిశాల సాగరతీరం ఉన్న మన రాష్ట్రంలో మత్స్య సంపద పుష్కలంగా లభిస్తోంది. మత్స్యకారులను ప్రోత్సహించడంతో పాటు, మాంసాహార ప్రియులకు నాణ్యమైన తాజా చేపలు అందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా మినీ అవుట్‌లెట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. అంతే కాకుండా మత్స్యకారులు, ఆక్వాపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న వారిని మరింత ప్రోత్సహించేలా సబ్సిడీలతో వివిధ పథకాలు అమలు చేస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా సముద్రంలో చేపల వేట సాగించే వారికి వేట నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచింది. ప్రమాదవశాత్తూ మృతి చెందే మత్స్యకారుల కుటుంబాలకు రూ.10 లక్షల బీమా అందజేస్తోంది.

అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇటువంటి పథకాలతో పాటు వారి ఉపాధికి బాటలు వేసేలా కేంద్ర ప్రభుత్వం 2020–21 నుంచి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) ప్రారంభించింది. ఈ పథకం ద్వారా మత్స్యకార మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం వరకూ, ఇతరులకు 40 శాతం సబ్సిడీ అందిస్తోంది. ఇందులో కేంద్రం 36, రాష్ట్ర ప్రభుత్వం 24 శాతం భరిస్తున్నాయి. ప్రధానంగా సముద్ర జలాల్లో చేపల వేటకు వీలుగా మత్స్యకారులకు స్పీడ్ బోట్లు అందించేందుకు పీఎంఎంఎస్‌వై ఉపయోగపడుతోంది. దీంతో ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిపుచ్చుకుంది. **రాష్ట్రంలోని మత్స్యకారులు, ఆక్వా రంగంపై ఆధారపడిన వారిని ప్రోత్సహించేందుకు పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా అత్యధిక యూనిట్లు గ్రౌండ్ చేసేలా మత్స్యశాఖ అధికారులకు లక్ష్యాలు నిర్దేశించింది. ఐదేళ్ల పాటు అమలులో ఉండనున్న ఈ పథ**కంపై విస్తృత ప్రచారం చేస్తున్నారు.

అమలు చేశారిలా..

- పీఎంఎంఎస్‌వై కింద జిల్లాలో 2020–21, 2021–22 సంవత్సరాల్లో రూ.3,47,98,000 విలువైన 83 యూనిట్లు మంజూరయ్యాయి. వాటికి రూ.1,64,97,000 సబ్సిడీ మంజూరవగా.. ఇందులో కేంద్రం రూ.98.98 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.65.99 లక్షలు అందించాయి.
- బోట్లు మాత్రమే కాదు ఐస్ బాక్స్‌లతో కూడిన **మోటార్ సైకిళ్లు, మూడు చక్రాలతో కూడిన ఫిష్ వెండింగ్ వాహనాలు, మినీ కియోస్కులు, లైవ్ ఫిష్ వెండింగ్ వాహనాలు, సీడ్ రవాణా వాహనాలు కూడా పీఎంఎంఎస్‌వై కింద పంపిణీ చేశారు.**
- 2022–23 సంవత్సరానికి రూ.4.43 కోట్ల విలువైన 262 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిని మత్స్యకారులు, సంబంధిత జీవనోపాధి సాగించే వారు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది.
- అయితే, ఈ పథకంలో తమకు రూ.1.20 కోట్లతో ఇచ్చే పెద్ద బోట్లు వద్దని మత్స్యకారులు అంటున్నారు. దీనికి బదులు అందులో సగం వ్యయంతోనే వచ్చే చిన్న బోట్లు సమకూర్చాలని కోరుతున్నారు. ఈ మేరకు పథకంలో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.60 లక్షల యూనిట్లు మేలు



పీఎంఎంఎస్‌వై కింద రూ.1.20 కోట్లతో ఇచ్చే డీప్ వాటర్ వెసల్ కంటే రూ.60 లక్షల విలువైన యూనిట్ ఏర్పాటు చేసి, చిన్న బోట్లు పంపిణీ చేస్తే మత్స్యకారులకు మేలు జరుగుతుంది. ఆవిధంగా మార్పులు చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించుకున్నాం.

– బలసాడి రంగారావు, బోట్ల నిర్వాహకుడు, మత్స్యకార నాయకుడు, కాకినాడ

అవగాహన కల్పిస్తున్నాం



పీఎంఎంఎస్సై కింద మత్స్యకార మహిళలకు 60 శాతం సబ్సిడీపై వివిధ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. సముద్రంలో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు కొత్తగా బోట్లు, రవాణా వాహనాలు పొందవచ్చు. రూ.1.20 కోట్ల యూనిట్ ఎవ్వరూ అడగడం లేదు. మిగిలిన యూనిట్లు గ్రౌండ్ చేసేలా, సబ్సిడీ సద్వినియోగం చేసుకునేలా మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పీవీ సత్యనారాయణ, జిల్లా మత్స్య శాఖ అధికారి

22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా ప్రచురణకు ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా వెలగపూడిలోని సచివాలయం నుంచి కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణకు అవసరమయ్యే ఉద్యోగుల డేటాబేస్ రూపకల్పన పూర్తి చేయాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల శిక్షణకు అన్ని ఏర్పాట్లూ చేయాలన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బూత్ స్థాయి వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీరమణి, పెద్దాపురం, తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, కాకినాడ అర్బన్, పిఠాపురం తహసీల్దార్లు పీవీ సీతాపతిరావు, పి.త్రినాథరావు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలు

ఓటర్ల తుది జాబితాను జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. జిల్లాలోని వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను వివరించారు. జిల్లాలోని 1,637 పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంప్‌ల వంటి కనీస సౌకర్యాలపై ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు. ఈవీఎం ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కేంద్రాల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ స్పందనకు 15 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందనలో అందిన వినతులను అధికారులు ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని డీఆర్‌ఓ కె.శ్రీరమణి ఆదేశించారు. కలెక్టరేట్ స్పందన హాలులో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందన నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టరేట్ పరిపాలనాధికారి జీఎస్ఎస్ శ్రీనివాసులుతో కలిసి డీఆర్‌ఓ 15 అర్జీలు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సాయంత్రం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఇంక్రిమెంట్లు, బదిలీల వంటి అంశాలపై నాలుగు అర్జీలు అందాయి.

‘చేసిన పాపాలు అప్పుడే గుర్తుకు వస్తాయి’



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పాప ఫలితాలు అనుభవంలోకి వచ్చినప్పుడే చేసిన పాపాలు గుర్తుకు వస్తాయని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. స్థానిక హిందూ సమాజంలో శ్రీరామాయణ ప్రవచనాన్ని 38వ రోజైన శుక్రవారం ఆయన కొనసాగించారు. రావణుడికి వృద్ధ మంత్రి, అతడి తల్లికి పినతండ్రి అయిన మాల్యవంతుడు చెప్పిన హితోక్తులు.. వాటిని అతడు చెవికెక్కించుకోకపోవడం వంటి ఘట్టాలను వివరించారు. ‘నీపై దాడికి వచ్చిన రాఘవుడు మానవమాత్రుడు కాడు. సాక్షాత్తూ నారాయణుడే. రామునితో వైరం మానుకో. ధర్మం రాముని పక్షాన ఉన్నందున ఆయన నీకన్నా బలవంతుడు. ఉభయ సంధ్యల్లోనూ యముడు లంకలోని ఇళ్లను పరిశీలిస్తున్నట్టుగా చెడు శకునాలు కనపడుతున్నాయి’ అని మాల్యవంతుడు చెబుతాడని వివరించారు. ‘నా శరీరం రెండు ముక్కలయినా నేను ఎవ్వరికీ లొంగను. ఇది నా స్వభావం. స్వభావో దురతిక్రమః అని అంటారు గదా!’ అంటూ తాతగారు మాల్యవంతుడిపై రావణుడు మండిపడతాడని చెప్పారు. రావణునికి మరో అవకాశం ఇవ్వాలని భావించిన రాముడు.. అంగదుడిని రాయబారానికి పంపుతాడు. ‘రావణా! నీ ఐశ్వర్యం నిన్ను విడిచిపెట్టే సమయం ఆసన్నమయింది. నీవు దేవ దానవ గంధర్వాదులను హింసించావు. మునులను హతమార్చావు. నా బాణాల స్పర్శతో నీవు పవిత్రుడివయి, ఉత్తమ లోకాలు పొందుతావు. చివరిసారిగా నీ లంకను చూసుకో. నీకు శ్రాద్ధాది క్రియలు చేసుకో. లేదా సీతాదేవిని నాకు అప్పగించి, నన్ను శరణు కోరమని రాముడు చెప్పాడు’ అని అంగదుడు అంటాడు. దేవీ మహాత్మ్యంలో కూడా దేవి ఆయుధాలతో వధించడం వలన, ఆ ఆయుధ స్పర్శతో రాక్షసులు ఉత్తమగతులు పొందినట్టు ఉందని సామవేదం చెప్పారు. ‘నలుదిక్కులా ప్రాకారాలపై ఎగబాకిన వానర సైన్యాన్ని చూసి రావణుడు భయచిత్తుడయ్యాడు. లేని ధైర్యాన్ని కూడగట్టుకున్నాడు. ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రాలకు రామలక్ష్మణులు నిశ్చేష్టులయ్యారు. ఇంద్రజిత్తు తండ్రితో రామలక్ష్మణులు మరణించారని చెబుతాడు. ఈ వార్తను చాటింపు వేయమని, సీతాదేవిని పుష్పకంలో తీసుకువెళ్లి యుద్ధభూమిలో పడి ఉన్న రామలక్ష్మణులను చూపమని రావణుడు ఆదేశిస్తాడు. దుఃఖితురాలయిన సీతమ్మకు త్రిజట ధైర్యం చెబుతుంది. భర్త మరణించిన స్త్రీని పుష్పకం తీసుకురాదని, రాముడు తన తమ్మునితో కలసి సజీవునిగా ఉన్నాడని తెలుపుతుంది’ అని సామవేదం వివరించారు.

16 నుంచి నరసన్న కల్యాణోత్సవాలు


అమలాపురం రూరల్: అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ఫిబ్రవరి 16 నుంచి 25 వరకు విజయవంతంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ సభ్యులను కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఉత్సవ కమిటీ సభ్యులతో కలెక్టర్ అధ్యక్షతన ఉత్సవ ముందస్తు ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 19వ తేదీ అర్ధరాత్రి 12.29 గంటలకు స్వామివారి కల్యాణం, 20వ తేదీ మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం, 24వ తేదీ ఉదయం స్వామివారి చక్రస్నానం, 25వ తేదీ సాయంత్రం స్వామివారి తెప్పోత్సవం నిర్వహించాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు కల్యాణోత్సవానికి వస్తారని, వారికి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఉత్సవాలకు అవసరమైన పాసులను ఆర్డీవో జారీ చేయాలన్నారు. పోలీస్ రెవెన్యూ దేవదాయ శాఖలు ఈ ఉత్సవాల నిర్వహణ కోసం చక్కటి ప్రణాళిక, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దేవాలయం పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించిందన్నారు. లైటింగ్ ఏర్పాట్లను దేవదాయ శాఖ చేపట్టాలని ఆదేశించారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

కాకినాడ సిటీ: ఈ నెల 26న జరిగే భారత గణతంత్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లూ చేయాలని అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె సమీక్షించారు. పరేడ్‌కు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను సిద్ధం చేయాలని, పోలీస్ బ్యాండ్, జెండా ఆవిష్కరణ వేదిక, బందోబస్తు వంటి వాటిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కనీసం ఐదు సాంస్కృతిక కార్యక్రమాలకు తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. వ్యవసాయ, హార్టికల్చర్, మత్స్య, మార్కెటింగ్, డ్వామా, పంచాయతీరాజ్, డీపీఓ, హౌసింగ్, టిడ్కో, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ, విద్య, డీఆర్‌డీఏ, మెప్మా, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, వైద్య, ఆరోగ్యం తదితర శాఖలు ప్రభుత్వ పథకాలను ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తమ సేవలకు సంబంధించి ఆయా శాఖల ఉద్యోగుల పేర్లను జిల్లా రెవెన్యూ అధికారికి పంపాలన్నారు. అవార్డు గ్రహీతల పనితనం గురించి సంక్షిప్తంగా వివరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, డీఆర్‌ఓ, డీఆర్‌డీఏ పీడీ కె.రమణి తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో నవ్యత

- నవ్య ప్రాజెక్టు పరిధిలోకి జీజీహెచ్ క్యాన్సర్ విభాగం
- ఇకపై జాతీయ స్థాయి నిపుణుల సలహాలతో చికిత్స
- ప్రారంభమైన కార్యకలాపాలు



నవ్యలో నమోదు చేసిన రిపోర్టులపై అందిన నిపుణుల సూచనలను జీజీహెచ్ వైద్యులకు వివరిస్తున్న డాక్టర్ ఉమేష్



నవ్య ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, అధికారులు

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో క్యాన్సర్ సేవల్లో నవ్యతకు అంకురార్పణ జరిగింది. క్యాన్సర్ రోగుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్న జాతీయ స్థాయి స్వచ్ఛంద సేవా సంస్థ ‘నవ్య’తో పాటు, బాధితుల ప్రాణాలు నిలిపేందుకు పాటు పడుతున్న టాటా మెమోరియల్ ఆసుపత్రి సౌజన్యంతో, నేషనల్ క్యాన్సర్ గ్రిడ్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో నవ్య ప్రాజెక్టు కార్యకలాపాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాసన్ అధ్యక్షతన ఆయనతో పాటు టాటా మెమోరియల్ అనుబంధ హోమీబాబా క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, నవ్య ప్రతినిధి డాక్టర్ నితి మాథుర్, రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రమేష్‌లు సంయుక్తంగా నవ్య సేవలను ప్రారంభించారు. తొలి రోజున 10 మంది క్యాన్సర్ బాధితుల ఆరోగ్య నివేదికలను వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, జాతీయ స్థాయి నిపుణుల సలహాలు తీసుకున్నారు. వాటిని జీజీహెచ్ బృందాలకు డాక్టర్ ఉమేష్ విశదీకరించారు.

ఈ ప్రాజెక్టు ఎందుకంటే..

జీజీహెచ్‌కు ప్రతి నెలా సుమారు 6 వేల మంది క్యాన్సర్ రోగులు వస్తున్నారు. వీరిలో రేడియేషన్, కీమోథెరపీ, మందుల కోసం వస్తున్న వారే అధికం. నవ్య ప్రాజెక్టులో భాగంగా ప్రత్యేక ఆరోగ్య స్థితి, రోగ తీవ్రత ఉన్న బాధితులకు అదనపు వైద్య సలహాలు, సూచనలు అందించేందుకు జీజీహెచ్‌లో ఉన్న వైద్యులకు జాతీయ స్థాయి నిపుణులు తోడ్పాటునిస్తారు. తద్వారా సెకండ్ ఒపీనియన్, హయ్యర్ సెంటర్ రిఫరెన్సులను వెళ్లే రోగులకు మరింత సాంత్వన దక్కుతుంది.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో..

ఆరోగ్యశ్రీ తరహాలోనే ‘నవ్య’ రిజిస్ట్రేషన్‌కు ప్రత్యేక పోర్టల్ ఉంది. ఇందులో ‘నవ్య’ బృందం జీజీహెచ్ ఆంకాలజీ నిపుణుల సూచనలు, హెచ్‌ఓడీ అనుమతులతో రోగి వివరాలు నమోదు చేసి, మరింత అనుభవం ఉన్న వైద్యుల సలహాలు కోరుతుంది. వారు రోగి ఆరోగ్య నివేదికలు పరిశీలించి, తగిన వైద్య సేవలు సూచిస్తారు. ఇవి హయ్యర్ సెంటర్ స్థాయి వైద్య సేవలు. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ – ఏఐ) సహాయంతో ఈ ప్రక్రియ నిర్వహిస్తారు. రోగుల ఆరోగ్య నివేదికల నుంచి వైద్య సలహాలు, మందుల సూచనల వరకూ అత్యంత కచ్చితత్వాన్ని పాటించడం ఏఐ ప్రత్యేకత. నవ్య ప్రాజెక్టు కోసం రేడియేషన్ ఆంకాలజీ ఓపీ విభాగంలో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇందులో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగిస్తారు. వీరు నిర్ణీత కాల వ్యవధిలో జాతీయ నిపుణులతో అనుసంధానం అవుతూ స్థానిక ఆంకాలజీ నిపుణులకు సమాచారం అందిస్తారు.

క్యాన్సర్ రోగుల అపర సంజీవని



నవ్య ప్రాజెక్టు క్యాన్సర్ రోగుల అపర సంజీవని. రోగులు, వారి కుటుంబ సభ్యులపై ప్రయాణ, ప్రయాస భారాన్ని తగ్గించేందుకు ఇది ఉపయోగపడుతుంది. సాంకేతికత, కృత్రిమ మేధ జోడించి రోగులకు అత్యున్నత సహకారం అందించమే మా లక్ష్యం. జీజీహెచ్‌లో నిష్ణాతులైన ఆంకాలజీ నిపుణులున్నారు. వారికి నవ్య ప్రాజెక్టు మరింత తోడ్పాటు అందించనుంది.

– డాక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి, డైరెక్టర్, హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్

మన వైద్యులకు మరింత సహకారం



ఆంకాలజీ సేవల్లో జీజీహెచ్ ఎంతో ప్రసిద్ధి పొందింది. జీజీహెచ్‌లో హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాసన్ ఆధ్వర్యాన డాక్టర్ ప్రదీప్, డాక్టర్ నరసింహులు బృందాలు రోగులకు మంచి సేవలందిస్తున్నాయి. వారికి నవ్య ప్రాజెక్టు మరింత తోడ్పాటు అందించనుంది. జీజీహెచ్‌కు ఈ ప్రాజెక్టు వచ్చేందుకు ఎంతో కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలకు ధన్యవాదాలు.

– డాక్టర్ ఎస్.లావణ్య కుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్

రోగులకు సాంత్వన



రోగ తీవ్రతను బట్టి క్యాన్సర్ బాధితులు సెకండ్ ఒపీనియన్, హయ్యర్ సెంటర్లకు వెళ్లాలని నిర్ణయించుకుంటారు. ఇది ఖర్చు, ప్రయాసతో కూడుకున్నది. వారికి నవ్య ప్రాజెక్టు సాంత్వన. ఇంట్లో ఒక్కరికి క్యాన్సర్ సోకినా ఆ ప్రభావం కుటుంబంపై పడుతుంది. వ్యాధిని, వైద్యాన్ని రోగి భరించడం ఒక ఎత్తయితే, రోగికి సేవలందించడం కుటుంబ సభ్యులకు ఎంతో ప్రయాస. దీనికి నవ్య సేవలే పరిష్కారం. ప్రాజెక్టు పరిధిలో నమోదైన బాధితులకు హయ్యర్ సెంటర్ సేవలు ఇక్కడే అందుతాయి.

– డాక్టర్ పి.శ్రీనివాసన్, హెచ్‌ఓడీ, ఆంకాలజీ, జీజీహెచ్

రాష్ట్ర ప్రభుత్వం సహకారం



కాకినాడ జీజీహెచ్ సహా రాష్ట్రంలోని పలు ఆసుపత్రుల్లో నవ్య ప్రాజెక్టు సేవలు సమకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వానిది కీలక పాత్ర. ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు కేంద్ర ఆరోగ్య వర్గాలతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో కేవలం క్యాన్సర్ రోగుల ఆరోగ్య సేవల కోసం రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా ఏటా రూ.600 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇందులో సింహభాగం జిల్లా ఆసుపత్రులకు కేటాయించింది.

– డాక్టర్ రాగిడి రమేష్‌బాబు, కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ రాష్ట్ర నోడల్ అధికారి

క్లుప్తంగా

తల్లి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు


సాయమ్మ (ఫైల్)

ముమ్మిడివరం: తన తల్లి అదృశ్యం అయిందని కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని అన్నంపల్లి గ్రామానికి చెందిన అయినవిల్లి దేవి తన తల్లి లంక సాయమ్మ ఈ నెల 17 నుంచి కనిపించడంలేదని పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. 16వ తేదీ రాత్రి ఇంటిలోనే నిద్రించిందని తెల్లవారే సరికి సాయమ్మ కనిపించలేదని పేర్కొంది. గతంలో ఒకసారి ఇంటి నుంచి వెళ్లిపోయిన సాయమ్మ మళ్లీ తిరిగి వచ్చిందని, ఆమె ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని, ఫిట్స్ వస్తుంటాయని తెలిపింది. ఈ మేరకు ముమ్మిడివరం స్టేషన్ హెచ్‌సీ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి అదృశ్యంపై తండ్రి ..


వీర వెంకట భావన ఋషి (ఫైల్)

ముమ్మిడివరం: తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముమ్మిడివరం మండలం గేదెల్లంక గ్రామానికి చెందిన లొల్లి వీర వెంకట భావనఋషి (34) గత ఏడాది అక్టోబర్ నెల నుంచి కనిపించడం లేదని తండ్రి కృపానందం శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదృశ్యమైన భావనఋషి కోసం బంధువుల ఇంట గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు స్టేషన్ హెచ్‌సీ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి దుర్మరణం


రెహమతుల్లా (ఫైల్)

కరప: గ్రామ సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడగా, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. కరప పోలీసులు తెలిపిన కథనం మేరకు... బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన షేక్ రెహమతుల్లా(50) కరపలో నివాసం ఉంటూ చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. పెనుగుదురులోని మసీదులో నమాజ్ చేస్తుంటాడు. కరప నుంచి పెనుగుదురు మసీదుకు వెళ్లేందుకు షేక్ రెహమతుల్లా మోటార్ సైకిల్‌పై శుక్రవారం మధ్యాహ్నం బయలుదేరాడు. కరప టీపాయింట్ వద్ద రోడ్డు దాడుతుండగా, కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టి, ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రెహమతుల్లా తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీర్థ యాత్రలకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- అనకాపల్లి సమీపంలో శంకరం వద్ద రోడ్డు ప్రమాదం
- ఒకే కుటుంబంలో ముగ్గురు దుర్మరణం
- మృతులు బిక్కవోలు వాసులు
- మరో ఐదుగురికి స్వల్ప గాయాలు



కారులోనే సూర్యకుమారి మృతదేహం, భార్య సత్యవతి మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త సత్యనారాయణ


గాయపడిన దేవీ కుసుమను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు




ప్రమాదంలో మృతి చెందిన పోలిరెడ్డి సత్యవతి, పోలిరెడ్డి సూర్యకుమారి, పోలిరెడ్డి అభిరామ్ (ఫైల్)

అనకాపల్లి/బిక్కవోలు: ఏటా మాదిరిగానే తీర్థ యాత్రలకు వెళ్లి ఉత్సాహంగా తిరిగి వస్తున్న ఆ కుటుంబాన్ని పెను విషాదం కమ్మేసింది. రోడ్డు ప్రమాదం వారి ఆనందాన్ని ఆవిరి చేసింది. కారు టైరు పేలిన దుర్ఘటనలో కుటుంబంలోని ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో బంధువులు, సహ కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

అరసవిల్లి, శ్రీకూర్మం, సింహాచలంలో దైవదర్శనాలు చేసుకున్నారు.. అందరూ ఆనందంగా తిరుగుపయనమయ్యారు.. ఇంతలో పెద్ద శబ్దం.. అది వచ్చింది తమ కారు నుంచేనని తెలుసుకునేలోపే ఘోర ప్రమాదం.. కారు టైరు పంక్చర్ కావడంతో పల్టీలు కొట్టి, అందులో ప్రయాణిస్తున్న తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన పోలిరెడ్డి సత్యవతి (49), పోలిరెడ్డి సూర్యకుమారి (38), పోలిరెడ్డి అభిరామ్ (4) అక్కడికక్కడే మృతిచెందారు. అనకాపల్లి సమీపంలోని శంకరం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఈ దుర్ఘటన జరిగింది. బిక్కవోలుకు చెందిన పోలిరెడ్డి సత్యనారాయణ, అతని సోదరుడు తమ కుటుంబ సభ్యులతో ప్రతి ఏటా తీర్థయాత్రలకు వెళుతుంటారు. అలాగే ఈసారి కూడా శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకూర్మం, అరసవిల్లి, విశాఖ జిల్లాలోని సింహాచలం దేవాలయాలను దర్శించుకునేందుకు ఎనిమిది మంది రెండు కార్లలో వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పోలిరెడ్డి సత్యనారాయణ, అతని భార్య సత్యవతి, సత్యనారాయణ తమ్ముడి భార్య సూర్యకుమారి, సత్యనారాయణ కుమారుడు పోతురాజు(రాజా), మనవడు అభిరామ్, ఇంకా వెంకటరమణ, అశోక్, దేవీకుసుమలు ఒక కారులో వస్తున్నారు. మిగిలిన కుటుంబ సభ్యులు రెండో కారులో వస్తున్నారు. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం సమీపంలో కారు టైరు పేలిపోవడంతో పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టడంతో కారు వెనుక సీటులో ఉన్న ముగ్గురు మృతి చెందారు. ముందు సీటులో కూర్చున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షణాల్లో రహదారి అంతా రక్తసిక్తంగా మారింది. కారు పల్టీకొట్టి రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఒక పక్క మృతదేహాలు.. మరోపక్క గాయపడ్డవారి రోదనలు.. అటుగా రాకపోకలు సాగించే వారిని కంటతడి పెట్టించాయి. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ వి.సుబ్బరాజు, సీఐలు జి.శంకరరావు, టి.శ్రీను ఘటనా స్థలికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన కారును తొలగించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. క్షతగాత్రులకు ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రాథమిక చికిత్స చేసి, పంపించి వేశారు.

ఆకాశవాణి ఎఫ్‌ఎం రిలే కేంద్రం ప్రారంభం


ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సుబ్బారావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు వర్చువల్‌గా ఆకాశవాణి రాజమహేంద్రవరం ఎఫ్‌ఎం రిలే కేంద్రాన్ని చెన్నైలో ప్రారంభించారు. దీంతోపాటు మరో 11 ఆకాశవాణి ఎఫ్ ఎం ట్రాన్స్‌మిటర్లను, నాలుగు దూరదర్శన్ కేంద్రాలను ప్రధానమంత్రి ప్రారంభించడంతో పాటు, దేశ వ్యాప్తంగా మరో 26 ఎఫ్‌ఎం కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. స్థానిక లాలాచెరువు వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న రాజమహేంద్రవరం ఎఫ్‌ఎం రిలే కేంద్రంలో ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సి. సుబ్బారావు ప్రత్యక్షం రిలే కేంద్ర ట్రాన్స్‌మిటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. 102.9 మెగా హెర్ట్జ్ రాజమహేంద్రవరం ఎఫ్‌ఎం కేంద్రం ద్వారా ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర అన్ని కార్యక్రమాలు స్థానిక ప్రజలకు అందుబాటులోకి వస్తాయని సుబ్బారావు తెలిపారు. ఈ ట్రాన్స్‌మిటర్ ఏర్పాటు వలన ఆకాశవాణి కార్యక్రమాలు ఇటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ, అటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనూ స్పష్టంగా వినపడతాయన్నారు. సాంకేతికంగా కూడా కార్యక్రమాల్లో నాణ్యత పెరుగుతుందన్నారు. ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర కార్యక్రమాల అధిపతి సూర్యప్రకాశరావు మాట్లాడారు. ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర డైరెక్టర్ (ఇంజినీరింగ్) వి.ఎం.రత్నప్రసాద్, విజయవాడ దూరదర్శన్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఇంజినీరింగ్) ఇ.రవికుమార్, రాజమహేంద్రవరం ఎఫ్‌ఎం రిలే కేంద్ర ఇన్‌చార్జి జి.వేణు, ఆకాశవాణి, దూరదర్శన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరిదీ కారు?



అమలాపురం భోగరాజు వీధిలో పది రోజులుగా ఉన్న కారు

అమలాపురం టౌన్: పది రోజులుగా ఓ కారు రోడ్డు చెంతన ఉండడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అమలాపురం భోగరాజు వీధిలో శ్రీసత్యసాయి చెవి, ముక్కు, గొంతు హాస్పటల్ గోడకు చేర్చి రోడ్డు చెంత ఏపీ 9 ఏయూ 1234 నంబరు కారు నిలిపి ఉంది. కారు లాక్ చేయడంతో పాటు దుమ్మూధూళితో నిండి ఉంది. ఈ మేరకు హాస్పటల్ డాక్టర్ జి.ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కారు ఎవరిదో తెలుసుకోవాలని, ఇక్కడి నుంచి తరలించాలని కోరారు. దీనిపై అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ స్పందించారు. శుక్రవారం ఉదయం ఆ కారును పరిశీలించినా వివరాలు లభ్యం కాలేదు. పూర్తి స్థాయిలో విచారించి కారును అక్కడి నుంచి తరలించేలా చర్యలు చేపడతామని డీఎస్పీ తెలిపారు.

నేటి నుంచి జాతీయ టెన్నిస్ పోటీలు

- 24 వరకు నిర్వహణ
- 23 రాష్ట్రాల నుంచి 115 మంది క్రీడాకారులు : ఆర్జేడీ నాగమణి


పోటీల వివరాలు వెల్లడిస్తున్న ఆర్జేడీ నాగమణి. చిత్రంలో క్రీడా సమాఖ్య కార్యదర్శి భానుమూర్తి రాజు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న అండర్–19 పాఠశాల క్రీడాసమాఖ్య పురుషుల టెన్నిస్ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ, ఇన్‌చార్జి డీఈఓ నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి భానుమూర్తిరాజు, ఆర్‌జేడీ నాగమణి ముఖ్య అతిథులుగా పాల్గొని టోర్నీ వివరాలు వెల్లడించారు. ఆర్జేడీ నాగమణి మాట్లాడుతూ శనివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించే ఈ పోటీలకు 23 రాష్ట్రాల నుంచి 115 క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. పోటీల నిర్వహణకు కాకినాడ డీఎస్‌ఏ, పాతఎస్పీ ఆఫీసు వెనుక, డీమార్ట్ సమీపంలోని సింథటిక్ టెన్నిస్ కోర్టులను ఫ్లడ్ లైట్లతో సిద్ధం చేశామన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులకు జేఎన్టీయూకే, బెస్ట్‌ఇన్, కోస్టల్ ఇన్, జెడ్పీ గెస్ట్ హౌస్‌లలో వసతి ఏర్పాటు చేశామని తెలిపారు. పోటీల నిర్వహణకు కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ ఇలక్కియా ఆదేశాల మేరకు వివిధ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు పోటీలు డీఎస్‌ఏ క్రీడామైదానంలో ప్రారంభమవుతాయన్నారు. పాఠశాల క్రీడాసమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు మాట్లాడుతూ పోటీల నిర్వహణకు రాష్ట్ర క్రీడాసమాఖ్య నిధుల నుంచి రూ.6 లక్షలు మంజూరు చేశామన్నారు. 46 మంది కోచ్‌లు, 100 మంది స్థానిక అధికారులు పోటీల నిర్వహణలో పాల్గొంటున్నారని తెలిపారు. పాఠశాల క్రీడాసమాఖ్య నిర్వహణ కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్, ఉపవిద్యాశాఖ అధికారులు ఆర్‌జే డేనియేల్ రాజు, డి.సుభద్ర, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, సీనియర్ పీడీలు రంగారావు, రవిరాజు, బంగార్రాజు, కె.శ్రీనివాస్, హరిబాబు, నూకరాజు, పట్టాభి, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు. పోటీలలో పాల్గొంటున్న ఏపీ జట్టుకు ఆర్జేడీ నాగమణి రాష్ట్ర పాఠశాల క్రీడాసమాఖ్య సమకూర్చిన క్రీడాదుస్తులను అందజేశారు.

గాయపడిన యువకుడి మృతి

కేసు నమోదు చేసిన పోలీసులు


శరత్‌రెడ్డి మృతదేహం

అడ్డతీగల: మండలంలోని మల్లవరం మామిళ్ల సమీపంలోని తుప్పల్లో తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న యువకుడు గురువారం అర్ధరాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని డి.భీమవరం గ్రామానికి చెందిన నడిపల్లి శరత్‌రెడ్డి(30) రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నాడు. గురువారం అక్కడి నుంచి బైక్‌పై స్వగ్రామం డి.భీమవరం బయలుదేరిన అతను మల్లవరం మామిళ్ల సమీపంలోని రోడ్డుపక్కన తుప్పల్లో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో అర్ధరాత్రి పడి ఉన్నాడు. అదే మార్గంలో వెళుతున్న వై.రామవరం 108 వాహనం సిబ్బంది అతనిని గమనించారు. వెంటనే అంబులెన్స్‌లో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా శరత్‌రెడ్డి మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. శరత్‌రెడ్డిని గుర్తు తెలియని వాహనం ఢీకొందా.. లేదా బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఒప్పందం పునరుద్ధరణ


అవగాహన పత్రాలు పరస్పరం మార్చుకుంటున్న ప్రతినిధులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషన్ సొసైటీల మధ్య అవగాహన ఒప్పందాన్ని పునరుద్ధరించారు. ఈ మేరకు యూనివర్సిటీలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఉభయ సంస్థల ప్రతినిధులు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సొసైటీ చైర్మన్ పీవీవీ కృష్ణప్రదీప్ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేసి, పరసర్పం మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ గ్రూప్ 2 పోటీ పరీక్షలకు వెళ్లే యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అవసరమైన శిక్షణను అందించేందుకు ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషన్ సొసైటీ ముందుకురావడంతో ఈ ఒడంబడికను పునరుద్ధరించామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, పూర్వవిద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పురుగుమందు తాగి...

అల్లవరం: కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సామంతకుర్రు గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు (44) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అల్లవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న తన భార్యతో గొడవ పడి తన ఇంటికి సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి పురుగుమందు తాగాడు. తాను పురుగుమందు తాగానని, వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి బతికించాలని కుమారుడికి ఫోన్ చేసి వెంకటేశ్వరరావు చెప్పడంతో అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని అమలాపురంలో కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

పీఠాధిపతుల కృషి ప్రశంసనీయం

ఘనంగా గాడ్ 88వ జన్మదిన వేడుకలు


గాడ్‌కు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేద పండితులు

రాయవరం: ఆధ్యాత్మికత బోధనల ద్వారా సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తూ..ధర్మ ప్రచారానికి పీఠాధిపతులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) 88వ జన్మదిన వేడుకలు శుక్రవారం పీఠంలో ఘనంగా నిర్వహించారు. ప్రసార భారతి రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.అనంతపద్మనాభరావు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు ఆధ్యాత్మిక వేత్తలు ఉపన్యసించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, సాగరఘోష కవి గరికపాటి నరసింహారావు, యర్రాప్రగడ రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ భక్తులను సన్మార్గంలో నడిపించేందుకు పీఠాధిపతుల ఆధ్యాత్మిక సందేశాలు దోహదపడుతున్నట్లు తెలిపారు. పీఠాధిపతి గాడ్ ఇచ్చే సందేశాన్ని మన జీవితాలకు అన్వయించుకుని మంచి మార్గంలో నడవాలన్నారు. పీఠాధిపతులు ధర్మ పరిరక్షణకు చేస్తున్న సేవలను ప్రశంసించారు. ధర్మపథంలో ఏ విధంగా నడవాలి అనే విషయంలో రాముడు హైందవ సమాజానికి ఒక పెద్ద ఉదాహరణగా నిలిచారన్నారు. అయోధ్యలో సీతారాముల ప్రతిష్ఠ సందర్భంగా రాముడి ఆశీస్సులు ప్రజలందరికీ లభిస్తాయని ఆకాంక్షించారు. పీఠాధిపతి గాడ్ ప్రసంగిస్తూ ఆధ్యాత్మిక చింతన కలిగి, మంచి ఆలోచనలు చేసే వారికి దైవం తోడుగా నిలుస్తుందన్నారు. మంచి పనులు చేసేవారికి అమ్మదయ ఎన్నడూ ఉంటుందన్నారు. లోక కల్యాణం కోసం నిత్యం పీఠంలో అనేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు గాడ్ తెలిపారు. ఆధ్యాత్మిక చింతన ద్వారా పాజిటివ్ దృక్పథం అలవడుతుందన్నారు. విజయదుర్గాపీఠం ఆధ్యాత్మికతకు కేంద్రబిందువుగా భాసిల్లుతుందన్నారు. పీఠంలో బాంధవ్య విలువలు, ఆత్మీయత, అనురాగం, ఆప్యాయతలు లభిస్తాయన్నారు. పీఠాధిపతి గాడ్‌కు తిరుమల, కాశీ, అన్నవరం దేవస్థానాల నుంచి తీసుకుని వచ్చిన ప్రసాదాన్ని, వేదాశీస్సులను పండితులు అందజేశారు. అనంతరం విజయదుర్గా సేవా పురస్కారాన్ని అనపర్తికి చెందిన ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, మస్తానమ్మ దంపతులకు అందజేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు సభ నిర్వహణ చేశారు.


పీఠంలో పుష్పాలంకృతులైన విజయదుర్గా అమ్మవారు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అధిక సంఖ్యలో భక్తులు విజయదుర్గా పీఠానికి చేరుకున్నారు. పీఠంలోని విజయదుర్గా అమ్మవారికి పూజలు చేశారు. విజయదుర్గా అమ్మవారిని నయనానందకరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు పీఠాధిపతి గాడ్‌కు పాదపూజ చేశారు.

కార్యక్రమంలో వస్త్ర వ్యాపారి తుమ్మిడి రామ్‌కుమార్, జీఎస్‌ఎల్ అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు, వారణాశి, శృంగేరి శంకరమఠం మేనేజరు చల్లా అన్నపూర్ణప్రసాద్, వారణాశికి చెందిన ఆధ్యాత్మిక వేత్త చల్లా జగన్నాథశాస్త్రి, కాశీ విశ్వనాథ ఆలయ అర్చకులు ఓం ప్రకాష్ మిశ్రా, శ్రీరంగం రంగనాథస్వామి ఆలయ ప్రధాన అర్చకులు పరాశర లక్ష్మీనరసింహ భట్టర్ స్వామి, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్య వెంకటకామేశ్వరి, బలిజేపల్లి రమ, పీఆర్వో బాబి, కోట సునీల్‌కుమార్, కందర్ప హనుమాన్, భక్తులు పాల్గొన్నారు.

మహిళను రక్షించిన ధవళేశ్వరం పోలీసులు


కాటన్ బ్యారేజీ వద్ద రక్షించిన మహిళతో పోలీసులు

ధవళేశ్వరం: కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకునేందుకు కాటన్ బ్యారేజీ వద్దకు వచ్చిన కడియంకు చెందిన గొళ్ల ఆదిలక్ష్మి అనే మహిళను ధవళేశ్వరం పోలీసులు రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలిలావున్నాయి. కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన గొళ్ళ ఆదిలక్ష్మి కాటన్ బ్యారేజీపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతో శుక్రవారం ఉదయం వచ్చింది. కుటుంబ సభ్యులకు విషయం తెలియడంతో 112కు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం అందించారు. ధవళేశ్వరం సీఐ కె. మంగాదేవి, కానిస్టేబుల్స్ కె.అరవింద్, టి.వెంకటేశ్వరరావు కాటన్ బ్యారేజీ పరిసర ప్రాంతాలను గాలించి ఆత్మహత్యకు యత్నిస్తున్న ఆదిలక్ష్మిని అడ్డుకున్నారు. పోలీసులు ఆదిలక్ష్మికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్పీ పి.జగదీష్, ధవళేశ్వరం పోలీసులకు ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉత్సాహంగా జాతీయ మహిళా వాలీబాల్ పోటీలు


లీగ్ పోటీలలో తలపడుతున్న మహిళా వాలీబాల్ ప్లేయర్లు

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెం గ్రామంలో రెండు రోజులుగా జాతీయ మహిళా వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. స్థానిక అడబాల స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగుతున్న ఈ పోటీలకు దేశం నలుమూలల నుంచీ ప్రముఖ వాలీబాల్ ప్లేయర్లు హాజరయ్యారు. శుక్రవారం జరిగిన లీగ్ పోటీలలో ఈస్ట్రన్ రైల్వే జట్టుపై కేపీఆర్ జట్టు విజయం సాధించింది. టీఎస్ఎస్ జట్టుపై సౌత్ సెంట్రల్ రైల్వే జట్టు, కేఆర్‌పీ జట్టు పై పీకేఆర్ జట్టు, ఎస్‌ఏఐ జట్టుపై ఐసీఎఫ్ జట్టు విజయం సాధించాయి. మరో లీగ్ మ్యాచ్‌లో పీకేఆర్ జట్టుపై కేఏఆర్ జట్టు విజయం సాధించింది. మరో రెండు రోజుల పాటు లీగ్ పోటీలు జరుగుతాయని, ఫైనల్ పోటీలు ఈ నెల 23న జరుగుతాయని ఆర్గనైజర్ అడబాల వేణుగోపాల్ తెలిపారు. డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మజీ, వైద్యులు గంధం విశ్వనాథ్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ పాల్గొన్నారు.